# ప్రభుత్వ దవాఖానలో అన్నదానం



అన్నదానం చేస్తున్న అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు

కామారెడ్డి, డిసెంబర్ 17 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో కామారెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్, అయ్యప్ప ఆలయ కమిటీ శాశ్వత అధ్యక్షుడు చీల ప్రభాకర్ మొదటి వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధ్యక్షుడు పట్నం రమేశ్, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్, అన్న ప్రసాద సేవా సమితి అధ్యక్షుడు నస్కంటి శ్రీనివాస్, కోశాధికారి కూర శ్రీనివాస్, మానస రాజేందర్, ఆముదాల రమేశ్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ



రాజంపేట్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బీబీపేట్, డిసెంబర్ 17: బీబీపేట మండలంలోని శ్రీగాధ రోడ్డులో ఏఎస్సై ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువ పత్రాలు లేని 35 మంది వాహనాదారులకు జరిమానా విధించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమ, నిబంధనలను తప్పకుండా పాటించాలని ఏఎస్సై సూచించారు. తనిఖీల్లో నవీన్‌కుమార్, రంజిత్‌గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**రాజంపేట్ మండల శివారులో..**

రాజంపేట్, డిసెంబర్ 17: మండల శివారులో ఏఎస్సై గంగారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పలు వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు. వాహనదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై గంగారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చుక్కాపూర్ లో భక్తుల సందడి



దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

మాచారెడ్డి,డిసెంబర్ 17 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొని ఒడి బియ్యం,పట్టేనామాలు,కోరెమీసాలు,కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు.నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్‌రెడ్డి తెలిపారు.

**రూ.లక్ష విరాళం అందజేత**

కామారెడ్డి పట్టణానికి చెందిన బండ్ల విష్ణుమూర్తి – లత దంపతులు లక్ష్మీనర్సింహస్వామి ఆలయాభివృద్ధి కోసం లక్షా నూటపదహారు రూపాయలను విరాళంగా ఆలయ కమిటీ చైర్మన్‌కు అందజేశారు.ఈసందర్భంగా వారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించి, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.



దోమకొండలోని ప్రధాన దారి మధ్యలో ఏపుగా పెరిగిన మొక్కలు

# 'హరిత'దారులు..

- స్వాగత తోరణంలా ప్రధాన రోడ్లు
- ఆహ్లాదం పంచుతున్న పచ్చని చెట్లు
- పచ్చదనంతో కళ కళ లాడుతున్న దోమకొండ

**హరిత తెలంగాణే** లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన హరితహారం కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తున్నది. ఏ గ్రామంలో చూసినా పరుచుకున్న పచ్చదనం కనువిందు చేస్తున్నది. హరితహారం కార్యక్రమం ద్వారా దోమకొండ మండలంలోని పలు దారులు హరిత తోరణాలు మారాయి. మండలంలోని పలు గ్రామాల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు నేడు ఏపుగా పెరిగాయి. జీవకోటికి ప్రాణాధారమైన చెట్లను ఇష్టారీతిన నరికి వేస్తుండడం.. పర్యావరణం, మానవాళికి ముప్పుగా మారాయి. ప్రాణవాయువు సరిగా అందక, వర్షాలు కురవని పరిస్థితుల్లో మున్ముందు కలిగే నష్టాలను దృష్టిలో ఉంచుకొని వాటిని అరికట్టేందుకు కేసీఆర్ హయాంలో ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా దోమకొండ మండల పరిధిలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. వాటిని సంరక్షించడంతో ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి బాటసారులకు ఆహ్లాదం పంచుతున్నాయి. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పచ్చని మొక్కలు ఏపుగా పెరిగి నీడనిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో నాటిన మొక్కలతో వనాన్ని తలపిస్తున్నాయి. దోమకొండ నుంచి బీబీపేట, లింగుపల్లికి వెళ్లే రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు.. పచ్చదనంతో కళ కళ లాడుతున్నాయి. - దోమకొండ, డిసెంబర్ 17

### ఎటు చూసినా పచ్చదనమే..



మండలంలోని అన్ని గ్రామాల్లో హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చని తోరణాల్లా కనిపిస్తున్నాయి, రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు పచ్చదనంతో బాటసారులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.

**- ఉగ్రవాయి విఠల్, దోమకొండ**

### ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తున్న రహదారులు



రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో హరితహార కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. హరిత తెలంగాణే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం పనిచేసింది.

**-బుర్రి రవి కుమార్, దోమకొండ**

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి..



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి. అడవుల శాతం తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశం. వర్షాలు సమృద్ధిగా కురవాలంటే మొక్కలు నాటాల్సిందే.

**-జొన్నల కిషన్, దోమకొండ**



దోమకొండ నుంచి అంచనూర్ వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కలు



దోమకొండ నుంచి లింగుపల్లికి వెళ్లే మార్గంలో..

## పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బీబీపేట్, డిసెంబర్ 17: ఉచిత పశువైద్య శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి సింహారావు, మండల పశువైద్యాధికారిణి హేమశ్రీ సూచించారు. మండలంలోని జనగామ గ్రామంలో ఆదివారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా పశువైద్యాధికారి హాజరై పాడి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులకు పాడి పోషణలో మెళకువలు, పశుగ్రాస పెంపకం ఆవశ్యకతను వివరించారు. పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్ చందర్, ఏడీలు శ్రీనివాస్, సంజయ్, సర్పంచ్ రాజు, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి సింహారావు, మండల పశువైద్యాధికారిణి హేమశ్రీ

## పశువులకు పోషకాలతో కూడిన దాణా అందించాలి

**జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి సింహారావు**

కామారెడ్డి,డిసెంబర్ 17 : పశువులకు మరిన్ని పోషకాలతో కూడిన దాణాను అందించాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి సింహారావు రైతులకు సూచించారు. మారుతున్న సీజన్‌కు అనుగుణంగా పశువుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాధారణంగా శీతాకాలంలో పశువులు మేతమేయడానికి అంతగా ఆసక్తి చూపవని దీంతో పాల ఉత్పత్తి తగ్గుతుందని తెలిపారు. అందుకే పశువులకు అందించే దాణా విషయంలో మార్పులు చేసుకోవాలని సూచించారు. చలిలో పగటి సమయం తక్కువగా, రాత్రి సమయం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. చలికాలంలో దోమ కాటు, ఇతర వైరస్‌ల వ్యాప్తితో గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులు రోగాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం, రాత్రి వేళ్లలో పశువులకు ఎండుగడ్డి పొడి దాణాను ఉదయం 11 గంటల ప్రాంతంలో అందించాలని ఆయన సూచించారు.